


# మాధురి

★

రచన :


* శ్రీ వెలగందుల విజయభాస్కర్ *


భాస్కర్ ఒక మంచి కళాకారుడు. పాటలు చాలా బాగా పాడుతాడు. నాటకాల్లో వేషాలు వేస్తాడు. నాటకాల్లో అనుభవం గడించిన తరువాత ఒక నాట్య కళామండలి స్థాపించాడు. వారి నటవర్గం దాదాపు పది మందివరకు ఉంటారు. వీరు ప్రదర్శించిన ప్రతి నాటకం ప్రతిచోటా దిగ్విజయంగా నడిచింది. ప్రతి నాటికకు, నాటకానికి భాస్కరే దర్శకత్వం వహించేవాడు

భాస్కర్ డైరెక్షన్ అంటే ప్రతి ఒక్కరూ చెవి కోసుకునేవారు. వీరు ప్రదర్శించే ప్రతి నాటిక వీరినట వర్గంలో ఒకరయిన చలం రాసేవాడు. మిగిలిన నటవర్గం ఎలాగయినప్పటికినీ భాస్కర్ మరియు చలం మాత్రం ప్రాణస్నేహితులు. వీళ్ళిద్దరూ అప్పుడప్పుడు చర్చించు కుంటూండేవారు. 'మన నటవర్గంలో ఒక ఆడమనిషి ఉంటే బాగుండును' అని.

భాస్కర్ నటనంటే, డైరక్షనంటే చెవికోసుకునే మాధురి వీరి నటవర్గంలో చేరింది. మాధురికి నాటకా లంటే చాలా సరదా. అప్పుడప్పుడూ కొన్ని నాటకాల్లో వేషాలు వేసింది కూడా. పాటలు కూడా భాస్కర్ కలెనే చక్కగా పాడగలదు. ఇంటర్ మీడియట్ వరకూ చదువుకుంది. ఈ పాటల, నాటకాల పిచ్చిలో పడి చదువుకు స్వస్తి చెప్పింది.

మాధురికి ఒక పెంపుడు తండ్రి తప్ప నా అనేవారు ఎవరూ లేరు. ఆ పెంపుడు తండ్రి ఒక లారీ డ్రైవర్! ఎప్పుడూ త్రాగుతూ వుంటాడు. మాధురి విషయంలో ఎప్పుడూ ఏ శ్రద్ధా తీసుకోడు. ఆమె అడిగినప్పుడు అవ సరాలకు మాత్రం డబ్బులు ఇచ్చేవాడు. మాధురి ఎంతో జాగ్రత్తగల యువతి కాబట్టి ఇంటర్ మీడియట్ వరకూ చదువు నెట్టుకొచ్చింది.

మాధురి నటవర్గంలో చేరడంతో వీరి నాట్యకళా మండలికి మంచి పేరుప్రతిష్టలు వచ్చాయి ముఖ్యంగా మాధురి పాటలు, డాన్స్ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్నాయి. దానికి తోడు భాస్కర్ చాలెంజ్ గా అక్ట్ చేయడంవల్ల వారి కళామండలి పేరుప్రతిష్టలు ఆకాశాన్నంటుకున్నాయి.

వీటి నాట్య కళామండలిలో కొందరికి సినిమా చాన్సులు వచ్చే అవకాశం లభించింది. వారిలో ముఖ్యంగా మాధురి, భాస్కర్, చలం వీళ్ళకు నిర్మాతల నుండి పిలుపులొచ్చాయి. భాస్కర్, చలం సినిమాల్లో చేరడానికి ప్రయత్నించారు. చలం మాత్రం వెంటనే చిత్రసీమలో అసిస్టెంట్ డైరెక్టర్ గా స్థిరపడ్డాడు. భాస్కర్ మాత్రం కొన్ని ఆర్థిక ఇబ్బందులవల్ల చిత్ర సీమలో చేరలేకపోయాడు. మాధురికి యిష్టం వున్నా భాస్కర్ తోనే ప్రోగ్రామ్ లు ఇవ్వడానికి నిశ్చయించు కుంది,

ఒక విధంగా చెప్పాలంటే భాస్కర్ జల్సా రాయుడు. ఎప్పటి సంపాదన అప్పుడే ఖర్చుచేసేవాడు. అందుకే ఎప్పుడూ స్నేహితులు వెంబడే వుంటారు. చలం అలా కాదు. చాలా పొదుపు మనిషి. అందుకే అంత ఎత్తుకు ఎదురగలిగాడు. మాధురి మాత్రం తన డబ్బును ఖర్చులు పోను మిగిలింది బ్యాంక్ లో దాస్తుంది. తను చాన్సులు వచ్చినా సినిమాల్లో చేరకపోవడానికి కారణం భాస్కర్ పై ఇంత అని చెప్పరానటువంటి ప్రేమే. భాస్కర్ మాత్రం ఎప్పుడూ ఆమెని తోటి కళాకారిణిగా గౌరవించేవాడే గాని మరో దృష్టితో మాత్రం చూచేవాడు కాదు. తోటి సహవాసిగా ఎంతో చనువుగా ప్రవర్తించేవాడు. హాస్యమాడేవాడు.

చిలిపిగా నవ్వేవాడు. మాధురి మాత్రం దైవంగా, గురువుగా, ప్రియుడుగా ఆరాధిస్తుంది. పూజిస్తుంది. గౌరవిస్తుంది. ఎప్పుడూ ఈ విషయాన్ని అతనిముందు ఎత్తలేదు తనను నిరాకరించడనే ధీమాతో.

ఒకనాటి రాత్రి పాటల ప్రోగ్రాంకు పోయివచ్చిన తర్వాత తన హృదయంలోని భావాలను బయటికి మాటల రూపంలో చెప్పకుండా హావభావాలతో ప్రదర్శించింది.

భాస్కర్ ముందు కాస్త సిగ్గుపడ్డా ఆ తర్వాత ఆశ్చర్యపోయాడు. శరీరంనుండి ఒక్కొక్క పొరనే తీసివేస్తుంది చీరను. దాదాపు అర్ధనగ్నంగా తయారయింది. కళ్ళు కామంతో ఎరుపెక్కాయి. మత్తుగా ఒళ్ళు విరుచుకుంటూంది అరమోడ్పు కళ్ళతో.

'మాధురీ!' చిన్నగా పిలిచాడు. అందులో గంభీరత ద్యోతకమౌతూంది.

కళ్ళు తెరచి చూసింది.

'చీరకట్టుకో! ఈ కళామతల్లికి సేవ చేయడానికి నీవు తగవు. వెంటనే పెళ్ళి చేసుకో.' సౌమ్యంగానే అన్నాడు కాని, అందులో కొంచం ఘాటుకూడా వుంది.

ఒక్కసారిగా మాధురిలోని మత్తు దిగిపోయింది. చీర సర్దుకుంది. 'ఏమిటి భాస్కర్ నీవు మాట్లాడుతుంది? నన్ను ఇంత నీచంగా అర్థం చేసుకుంటావనుకోలేదు' అని తన గదిలోకి పోయి వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

భాస్కర్ కూడా మాట జారినందుకు బాధపడ్డాడు. మాధురిని ఓదార్చాలనుకున్నాడు. కాని, ఇది తరుణం కాదని గ్రహించి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

♦ ♦ ♦

ఉదయం ఎప్పుడూ తనకంటే ముందులేచే మాధురి ఇంకా గదినుండి బయటకు రాకపోవడంతో తనే

ప్రీమియర్ కార్పొరేషన్ వారి అపూర్వ తయారింపులు.



* తక్కువ విద్యుచ్ఛక్తి
* దీర్ఘకాల మన్నిక
* మీకు ఎప్పటికీ శ్రమ నివ్వదు.



—: మా తయారింపులు :—

- మోనోబ్లాక్
- బెల్టు పంపు
- డొమెస్టిక్ పంపు
- మోటారు పంపు
- ఎలెక్ట్రిక్ మోటార్
- జెట్ పంపులు
- వెట్ గ్రైండర్స్

—: తయారుచేయువారు :—

PHONE: 27408

Premier Corporation

(Prop: P. V. JAGADEESAN)

Papanaikanpalem :: COIMBATORE - 641 037.




ఎల్లప్పుడూ...

* నోబల్, * రాము, * ఫోనిక్స్,
* కూల్ టెక్స్, * లిమకా, * గ్రేస్,
* లవ్ ఇన్ టోకియో, * హాంగ్ కాంగ్, * సఫైర్,

ఫైన్ బనియన్స్ మరియు కలర్ బనియన్లు వీటినే వాడండి.

ఆంధ్రప్రదేశంలోని అన్ని ప్రముఖ దుకాణాల్లోనూ దొరుకును.

——————: తయారించువారు :——————

Phone: 22012

**Ramu Hosieries (Regd.)**

**Lakshminagar Main Road,**

**TIRUPUR - 638 602.**

'మాధురి' అంటూ తలుపులు నెట్టాడు. లోపల గడియ లేదు, వెంటనే తెరుచుకున్నాయి, కాని గదిలో మాధురి లేదు. టేబుల్ పై ఒక కాగితం ఇంక్ పాడ్ బాలెన్స్‌తో రెపరెప లాడుతోంది భాస్కర్‌కంతా అయోమయంగా వుంది వెంటనే ఆ కాగితం తీసి చదివాడు. అతను అలాగే అవాక్కయిపోయాడు. కొన్ని క్షణాల తర్వాత తేరుకొని కళ్ళనీరు ఒత్తుకుంటూ బయటకు వచ్చాడు.

'మాధురి ఎందుకని చేసింది?' అనుకున్నాడు మనసులో.

'ప్రియమయిన భాస్కర్! నేను మన కళామండలిలో చేరకముందే నీకు నా హృదయంలో స్థానమిచ్చాను. నన్ను కాదనవనే నమ్మకంతో, ఆత్మస్థయిర్యంతో నా హృదయంలో నీ విగ్రహాన్ని నిలుపుకున్నాను. రాత్రి నీ మీద నా కున్న ప్రేమను నోటితో చెప్పకుండా హావ భావాలతో ప్రదర్శించి నీ ప్రేమకు పాత్రురాలను కావాలనుకున్నాను. కాని, నీ హృదయంలో కామాందురాలికిచ్చే స్థానం ఇచ్చావు. అవమానించావు. అయినా నీ మీద నాకు కోపంలేదు. నీవు క్షేమంగా వుండాలనే కోరుకుంటాను. నీకు దూరంగా వెళ్ళిపోతున్నాను. అయినా నిన్ను మాత్రం హృదయంలో పూజిస్తూనే వుంటా,'

"నీ మాధురి"

మాధురి వెళ్ళిన తర్వాత భాస్కర్ ఏ ప్రోగ్రాంలకు వెళ్ళడంలేదు. క్రమక్రమేణ కళామండలి పేరు దెబ్బతింది. 'చెరువులో నీరున్నంతవరకే కప్పలు!' అలాగే కళామండలిలోని సభ్యులంతా వెళ్ళిపోయారు. ఏకాకిగా మిగిలాడు భాస్కర్! రోజులు గడుస్తున్నాయి చేతిలో డబ్బంతా ఖర్చయిపోయింది. వీధిలో ఒక చెట్టు క్రింద బండమీద చతికిలబడ్డాడు.

రోజూ అదే బండమీద కూర్చుంటాడు. ఏదో ఆలోచిస్తూ వుంటాడు. కూని రాగాలు తీస్తూ వుంటాడు. దాహం వేసినప్పుడల్లా ప్రక్కనేవున్న నల్లా దగ్గరకు పోయి నీళ్ళు త్రాగుతాడు. ఇతని పరిస్థితిని రోజూ ఒక కూలిపిల్ల గమనిస్తూ వుంది. ఏమయినా అడగాలను కుంటుంది కాని 'ఉలకడు, పలకడు జడపదార్థం' అనుకుంటుంది.

ఒకనాడు ధైర్యం చేసి అడిగింది ఆ కూలిపిల్ల. 'ఎవరయ్యా నువ్వు? ఇక్కడ కూర్చుంటున్నావ్ రోజూ! ఎవరూ లేరా నీకు?'

తల పైకెత్తి 'ఆఁ...నా కెవరూ లేరు.' అని తల దించుకున్నాడు.

'ఏంపని చేస్తవు నువ్వు? నీకూడెవరు పెడతారు? ఆకలేస్తే తింటవ్?' ప్రశ్నలవర్షం కురిపించింది,

'ఏ పనీ లేదు,'

'నాతో వస్తావా? పని చూపెడతా.'

'వస్తా!'

'రా మరి' అని 'నీకిల్లులేదు. ఎవరూ లేరు. ఎక్కడుంటావ్? మా ఇంట్లో వుంటావా?' అంది.

'అలాగే!' అన్నాడు.

భాస్కర్‌వి రోజులిలాగే దొర్లిపోతున్నాయి.

ఆ కూలిపిల్ల పేరు ఎల్లమ్మ. దానికి ఒక అయ్య మాత్రమే వున్నాడు. వాడు గ్రుడ్డివాడు. ఎల్లమ్మ పని చేయకముందు ముష్టెత్తి పెంచి పెద్దచేశాడు గ్రుడ్డి అయ్య.

భాస్కరు సహవాసంవల్ల ఎల్లమ్మ హృదయానికి ఎంతో హాయి కలిగింది. ఎప్పుడూ పాటలు పాడుతూ సంతోషపెడతాడు. ఎల్లమ్మ మంచితనం భాస్కర్‌ను నవరసాలతో ముంచెత్తుతోంది.

ఒక శుభముహూర్తాన ఆ గూడెం పెద్దలు వీరిద్దరికీ




గుళ్ళో పెళ్ళి చేశారు.

ఈ పెళ్ళి సందర్భంగా రెండు రోజులూ పని మానుకున్నారు యిద్దరూ. వీరి సంసారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వుంది. కాని, మాధురి జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా మనస్సు చివుక్కుమంటుంది.

ఈ మధ్యనే తెలిసింది మాధురి సినిమా నటి అయిందని. భాస్కరు సంతోషానికి అంతులేదు. తన సహవాసి ఏమయిపోతుందోననుకున్న సహవాసి ఒక వున్నత స్థానంలో ఉన్నదంటే ఎవరికయినా సంతోషమే!

ఈ శుభ సందర్భంలో రెండు రోజుల కూలి పైకంతో మిఠాయి తెచ్చి గూడెంలో పంచడానికి సంబరంతో పరిగెత్తుక వస్తున్నారు భాస్కర్, ఎల్లమ్మ.

సంతోషంలో వెనకాముందూ చూడకుండా భాస్కరు వెంటే ఎల్లమ్మ పరుగుతీస్తోంది.

స్పీడ్‌గా వస్తున్న కారు బ్రేక్ వేసినా ఆగలేదు.

ఎల్లమ్మ కారు క్రింద పడింది.

'ఎల్లమ్మా!' అంటూ అరిచాడు.

కారులోంచి నల్ల కళ్ళద్దాల ఒక దొరసాని దిగింది. క్షమాపణ చెప్పుకుంది. హాస్పటల్‌లో నయం చేయిస్తానంది. నష్టపరిహారం చెల్లిస్తానంది. భాస్కరును పరీక్షగా చూస్తూ కళ్ళద్దాలు తీసింది.

'మాధురి నువ్వా!' అన్నాడు భాస్కర్ ఆశ్చర్యంగా.

'భాస్కర్! ఈ స్థితిలో నువ్వా!' బాధపడింది.

'తర్వాత మాట్లాడుకుందాం. ముందు ఎల్లమ్మను హాస్పిటల్లో చేర్పిద్దాం.'

హాస్పిటల్లో చేర్పించారు ఎల్లమ్మను.

రక్తం కావాలన్నాడు డాక్టర్.

ఆ గ్రూపు రక్తం హాస్పిటల్‌లో లేదట.

'నా రక్తం పరీక్షించండి డాక్టర్.' అంది మాధురి.

మాధురి రక్తదానంవల్ల బ్రతికింది ఎల్లమ్మ.

ఒకరి గురించి ఒకరికి పరిచయం చేశాడు భాస్కర్!

వెళ్ళిపోయి కంటనీరు పెట్టుకుంది మాధురి.

'మాధురి! నవ్వుతూ వెళ్ళాలి!' అన్నాడు భాస్కర్!

'భాస్కర్! ఒకమాట. నీకు బిడ్డ గాని పుడితే నా పేరే పెట్టుకుంటావు కదూ!' అంటూ అతని చేతిని ముద్దు పెట్టుకున్నది.

ఎల్లమ్మ చిన్నగా నవ్వింది.